# టాప్-2లో బెంగళూరు

## లక్నోపై ఆర్‌సీబీ భారీ విజయం • జితేశ్ కెప్టెన్ ఇన్నింగ్స్ • పంత్ శతకం వృథా • ఐపీఎల్‌లో ముగిసిన లీగ్ దశ

లక్నో: పాయింట్ల పట్టికలో టాప్-2 లక్ష్యంగా ఈ సీజన్‌లో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. కీలక పోరులో బంతితో విఫలమైనా బ్యాట్‌తో దుమ్మురేపింది. మంగళవారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు.. ఆరు వికెట్ల తేడాతో ప్రత్యర్థిని ఓడించింది. లక్నో నిర్దేశించిన 228 పరుగుల భారీ ఛేదనను బెంగళూరు.. 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి దంచేసింది. ఛేదనలో తాత్కాలిక సారథి జితేశ్ శర్మ (33 బంతుల్లో 85 నాటౌట్, 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపులకు తోడు విరాట్ కోహ్లీ (30 బంతుల్లో 54, 10 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 41 నాటౌట్, 5 ఫోర్లు) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు.. రిషభ్ పంత్ (61 బంతుల్లో 118 నాటౌట్, 11 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ శతకంతో చెలరేగగా మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 67, 4 ఫోర్లు, 5 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ మ్యాచ్‌తో ఐపీఎల్-18లో లీగ్ దశ ముగిసింది. ఈ మ్యాచ్ ఫలితం అనంతరం బెంగళూరు, పంజాబ్ తలా 19 పాయింట్లతో సమానంగా ఉన్నా నెట్‌రన్ రేట్ విషయంలో కింగ్స్ మెరుగ్గా ఉండటంతో ఆర్‌సీబీ రెండో స్థానానికి పరిమితమైంది. ఈనెల 29న పంజాబ్, బెంగళూరు క్వాలిఫయర్-1 ఆడనుండగా 30న జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్.. ముంబైతో తలపడనుంది.


పంత్ (118*)


జితేశ్ (85*)

### రిషభ్, మార్ష్ ధనాధన్

లక్నో ఇన్నింగ్స్‌లో పంత్ ఇన్నింగ్సే హైలైట్. సీజన్ ఆసాంతం విఫలమైన అతడు.. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తానేంటో నిరూపించే ఇన్నింగ్స్ ఆడాడు. ఓపెనర్ బ్రీట్జ్ (14).. లక్నో స్కోరు 25 పరుగుల వద్దే ఔట్ అవడంతో క్రీజులోకి వచ్చిన పంత్.. మార్ష్‌తో కలిసి బౌండరీలు, సిక్సర్లతో చెలరేగాడు. వచ్చీరాగానే యశ్ దయాల్ 4వ ఓవర్లో 6, 4, 4తో బాదుడు మొదలుపెట్టిన పంత్.. భువనేశ్వర్ ఓవర్లో 6, 4 దంచాడు. సుయాశ్ బౌలింగ్‌లో రెండు బౌండరీలతో 29 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తయింది. మరో ఎండ్‌లో మార్ష్ సైతం షెపర్డ్ బౌలింగ్ ఫోర్, సిక్సర్ కొట్టగా సుయాశ్ ఓవర్లో సిక్స్‌తో ఈ సీజన్‌లో 7వ హాఫ్ సెంచరీ నమోదుచేశాడు. ఈ క్రమంలో భువీ 16వ ఓవర్లో మార్ష్‌ను ఔట్ చేయడంతో లక్నో రెండో వికెట్ కోల్పోయింది. రెండో వికెట్‌కు పంత్-మార్ష్ ద్వయం 78 బంతుల్లోనే 152 పరుగులు జోడించింది. భువీనే వేసిన 18వ ఓవర్లో ఐదో బంతిని బౌండరీకి తరలించిన పంత్ 54 బంతుల్లో శతకాన్ని నమోదుచేశాడు.

### కోహ్లీ, జితేశ్ దూకుడు

ఛేదనలో బెంగళూరు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెన్ ఫిల్ సాల్ట్ (30), కోహ్లీ లక్నో బౌలర్లపై బౌండరీలతో విరుచుకుపడ్డారు. సాల్ట్‌ను ఆకాశ్ ఆరో ఓవర్‌లో పెవిలియన్‌కు పంపగా ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రజత్ పటీదార్ (14) విఫలమయ్యాడు. లివింగ్‌స్టొన్ డకౌట్ అవగా అర్ధ శతకం తర్వాత కోహ్లీ కూడా నిష్క్రమించడంతో బెంగళూరు శిబిరంలో ఆందోళన మొదలైంది. కానీ జితేశ్.. కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో చెలరేగి మ్యాచ్‌ను ముగించాడు. మయాంక్ అతడికి చక్కటి సహకారం అందించాడు.

OPERATION SINDOOR

### త్రివిధ దళాధిపతులకు స్వాగతం

ఈనెల 3న అహ్మదాబాద్ వేదికగా జరుగబోయే ఐపీఎల్ ఫైనల్‌కు ముందు నిర్వహించే ముగింపు వేడుకలకు ప్రత్యేక అతిథులుగా సాయుధ దళాధిపతులను ఆహ్వానించినట్టు బీసీసీఐ తెలిపింది. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌తో పాటు అత్యున్నత స్థాయి మిలిటరీ అధికారులు, పలువురు జవాన్లను ముగింపు వేడుకకు ఆహ్వానించినట్టు బోర్డు ఒక ప్రకటనలో వెల్లడించింది. సాయుధ దళాలను గౌరవించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు తెలిపింది.

### సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 227/3 (పంత్ 118*, మార్ష్ 67, తుషారా 1/26, భువనేశ్వర్ 1/46); బెంగళూరు: 18.4 ఓవర్లలో 230/4 (జితేశ్ 85*, కోహ్లీ 54, ఓరూర్క్ 2/74, అవేశ్ 1/32)



### నేటి నుంచి రోయింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరం మరో క్రీడోత్సవానికి సిద్ధమైంది. బుధవారం నుంచి హుస్సేన్‌సాగర్‌లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మొదలుకానున్నాయి. అండర్-13, అండర్-15 బాయ్స్, గర్ల్స్ విభాగాల్లో జరుగబోయే ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి సుమారు 350 మంది రోయర్లు పాల్గొననున్నారు. ఈ మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.పీ. మిథున్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. నాలుగేండ్ల తర్వాత ఈ టోర్నీకి హైదరాబాద్ ఆతిథ్యమివ్వబోతున్నదని.. రాబోయే రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు నగరం వేదిక కానుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

### క్వార్టర్స్‌కు మరో ఐదుగురు బాక్సర్లు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్స్ చేరారు. మంగళవారం జరిగిన పోటీలలో దీపక్ (75 కిలోలు), జుగ్ను (85 కి.), తమన్నా (51 కి.), ప్రియ (57 కి.), అంజలి (75 కి.) క్వార్టర్స్ చేరారు.

# విజయోత్సవ ర్యాలీలో విషాదం

## అభిమానులపై దూసుకెళ్లిన కారు

### నలుగురి పరిస్థితి విషమం • సుమారు 50 మందికి గాయాలు



లివర్‌పూల్: ఫుట్‌బాల్ అభిమానులు అమితంగా ఇష్టపడే 'ప్రీమియర్ లీగ్'లో విజేతగా నిలిచి విజయోత్సవ ర్యాలీ తీస్తున్న ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ లివర్‌పూల్ విక్టరీ పరేడ్ విషాదానికి దారితీసింది. ఈ లీగ్‌లో లివర్‌పూల్ జట్టు రికార్డుస్థాయిలో 20వ టైటిల్ గెలిచిన నేపథ్యంలో తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు వేలసంఖ్యలో జనం తరలిరాగా.. వారిపై ఓ దుండగుడు కారుతో దూసుకురావడంతో ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. లివర్‌పూల్‌లోని వాటర్ స్ట్రీట్ వద్ద జరిగిన ఈ ఘటనలో సుమారు 47 మందికి గాయాలవ్వగా వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బాధితులలో నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పలువురు అభిమానులు.. హుటాహుటిన కారు వద్దకు వెళ్లి దుండగుడిని దాన్లోంచి బయటకు తీసి పోలీసులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఇది ఉగ్రవాద చర్య కాదని తెలిపారు. ప్రమాద ఘటనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పందిస్తూ.. లివర్‌పూల్ ఇలాంటి కఠిన సవాళ్లను ఎన్నో తట్టుకుని నిలబడిందని, దేశం మొత్తం వారికి అండగా ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు పూర్తి మద్దతుగా ఉంటామని లివర్‌పూల్ ఒక ప్రకటనలో తెలిపింది.

# హెచ్‌సీఏపై విజిలెన్స్ విచారణ పూర్తి

• ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమాలు జరిగాయంటూ విచారణ చేపటిన విజిలెన్స్ అధికారులు.. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో విచారణ జరిపిన విజిలెన్స్.. సర్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు నిర్ధారించారు. టికెట్ల కోసం ఎస్‌ఆర్‌హెచ్ యజమాన్యాన్ని ఇబ్బంది పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. అప్పటికే పది శాతం టికెట్లను ఫ్రీగా ఇస్తున్న ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యంపై మరో మరో 10 శాతం టికెట్లు కావాలని హెచ్‌ఏసీ ఒత్తిడి తెచ్చిందని సమాచారం. ఈ క్రమంలోనే లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు హెచ్‌సీఏ సిబ్బంది తాళాలు వేశారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో హెచ్‌సీఏపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసిందని సమాచారం.

# జొకో వేట షురూ

### మెద్వెదెవ్‌కు తొలి రౌండ్‌లోనే షాక్



పారిస్: తన సుదీర్ఘ కెరీర్‌లో ఏడాదిన్నర కాలంగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్.. ఫ్రెంచ్ ఓపెన్‌ను విజయంతో ఆరంభించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ఆరో సీడ్ జొకో.. 6-3, 6-3, 6-3తో మెకంజీ మెక్‌డొనాల్డ్ (యూఎస్)ను వరుస సెట్లలో చిత్తు చేశాడు. ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన కూడా లేకుండానే జొకో మ్యాచ్‌ను ముగించాడు. సోమవారం రాత్రి ముగిసిన పోరులో ఒకటో సీడ్ యానిక్ సిన్నర్.. 6-4, 6-3, 7-5తో ఆర్థర్ (ఫ్రాన్స్)పై అలవోక విజయం సాధించాడు. మూడో సీడ్ అలగ్జాండర్ జ్వెరెవ్.. 6-3, 6-3, 6-4తో లర్నర్ టైన్ (యూఎస్)ను ఓడించాడు. కాగా స్టార్ ప్లేయర్ డేనియల్ మెద్వెదెవ్‌కు మాత్రం తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. మెద్వెదెవ్.. 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో కామెరూన్ నోరీ (బ్రిటన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ (అమెరికా) 6-2, 6-2తో ఒలివియా (ఆస్ట్రేలియా)పై నెగ్గగా.. మూడో సీడ్ జెస్సికా పెగుల (యూఎస్) 6-2, 6-4తో టొడొని (రొమానియా)ను చిత్తు చేసి రెండో రౌండ్‌కు ముందంజ వేసింది.

### సెబాస్టియన్‌కు కాంస్యం

# గుల్వీర్ పసిడి పరుగు

### ఏషియన్ అథ్లెటిక్స్‌లో భారత్‌కు ఒకే రోజు రెండు పతకాలు



గుమి (దక్షిణ కొరియా): ఏషియన్ అథ్లెటిక్స్‌లో తొలిరోజే భారత్‌కు రెండు పతకాలతో అదరగొట్టింది. పురుషుల పదివేల మీటర్ల పరుగు పందెంలో యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ స్వర్ణంతో సత్తా చాటగా 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో సెర్విన్ సెబాస్టియన్ కాంస్యంతో మెరిశాడు. 26 ఏండ్ల గుల్వీర్.. రేసును 28 నిమిషాల 38.63 సెకన్లతో పూర్తిచేసి పసిడి సాధించగా జపాన్ అథ్లెట్ మిబుకి సుజూకీ (28:43.84)కి రజతం, బహ్రెయిన్‌కు చెందిన అల్బర్ట్ కిబిచి (28:46.82) కాంస్యం గెలిచాడు. ఇదే రేసులో భారత్‌కే చెందిన సవన్ బర్వల్ (28:50.53) నాలుగో స్థానంలో నిలవడం గమనార్హం. ఇక సెబాస్టియన్.. 20 కి.మీ. రేసును ఒక గంటా 21 నిమిషాల 13.60 సెకన్లలో పూర్తిచేసి మూడో స్థానంలో నిలిచాడు. ఇవే పోటీలలో భాగంగా జరిగిన మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో అన్నూ రాణి నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల 1500 మీటర్ల రేసులో యూనుస్ షా ఫైనల్‌కు అర్హత సాధించాడు.

### పాయింట్ల పట్టిక

| జ | | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|---|
| పంజాబ్ | ✓ | 14 | 9 | 4 | 1 | 19 | 0.37 |
| బెంగళూరు | ✓ | 14 | 9 | 4 | 1 | 19 | 0.30 |
| గుజరాత్ | ✓ | 14 | 9 | 5 | 0 | 18 | 0.25 |
| ముంబై | ✓ | 14 | 8 | 6 | 0 | 16 | 1.14 |
| ఢిల్లీ | X | 14 | 7 | 6 | 1 | 15 | 0.01 |
| హైదరాబాద్ | X | 14 | 6 | 7 | 1 | 13 | -0.24 |
| లక్నో | X | 13 | 6 | 7 | 0 | 12 | -0.33 |
| కోల్‌కతా | X | 14 | 5 | 7 | 2 | 12 | -0.25 |
| రాజస్థాన్ | X | 14 | 4 | 10 | 0 | 8 | -0.54 |
| చెన్నై | X | 14 | 4 | 10 | 0 | 8 | -1.03 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# సింధు, ప్రణయ్ ముందంజ

### సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్



సింగపూర్: బీడబ్ల్యూఎఫ్ సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. స్టార్ షట్లర్లతో కూడిన భారత బృందంలో మొదటి రోజు పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ సింగిల్స్ విభాగాల్లో రెండో రౌండ్‌కు ముందంజ వేయగా ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి, మాళవిక బన్సోద్, అన్మోల్ ఖర్బ్ తొలి రౌండ్‌కే వెనుదిరిగారు. మహిళల సింగిల్స్‌లో సింధు.. 21-14, 21-9తో వెన్ యు ఝుంగ్ (కెనడా)పై అలవోక విజయం సాధించింది. 31 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సింధు.. రెండో రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ చెన్ యు ఫీ (చైనా)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్.. 19-21, 21-16, 21-14తో తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన డెన్మార్క్ షట్లర్ రస్మస్‌కు షాకిచ్చాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధృవ్ కపిల ద్వయం 18-21, 13-21తో చైనా జంట చెంగ్ జింగ్ - జంగ్ చి చేతిలో ఓడారు.

# నిజస్వరూపం బయటపెట్టుకున్నావు

చిత్రం






## దీపికా పడుకోన్‌పై సందీప్‌రెడ్డి ఫైర్

అగ్ర కథానాయిక దీపికా పడుకోన్, దర్శకుడు సందీప్ రెడ్డి మధ్య కోల్డ్‌వార్ మరింత ముదిరిపోయింది. ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా తీయబోతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి కథానాయికగా దీపికా పడుకోన్‌ను తొలగించిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రిని హీరోయిన్‌గా ఖరారు చేశారు. 'స్పిరిట్'లో తొలుత దీపికా పడుకోన్‌ను నాయికగా అనుకున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి ఆమెకు సినిమా కథ మొత్తం చెప్పారట. అయితే షూటింగ్ టైమింగ్స్, రెమ్యునరేషన్ విషయాల్లో దీపికా చేసిన డిమాండ్స్ సందీప్‌రెడ్డికి కోపం తెప్పించాయట. తాను కేవలం 6 గంటలు మాత్రమే పనిచేస్తానని, 30కోట్ల పారితోషికంతో పాటు అదనంగా జీఎస్టీ చెల్లించాలని, తనతో పాటు 20 మంది సిబ్బంది జీతభత్యాలను నిర్మాతలే చెల్లించాలని, వారికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని దీపికా పడుకోన్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. అందుకే ఆమెను సినిమా నుంచి తప్పించారని టాక్. ఈ నేపథ్యంలో సందీప్‌రెడ్డి చేసిన తాజా ట్వీట్ సంచలనంగా మారింది. పరోక్షంగా దీపికాను ఉద్దేశించే ఆయన ఈ ట్వీట్ చేశారంటున్నారు. 'అధికారికంగా ఒప్పందం చేసుకోకపోయినా..కథ ఎవరికీ చెప్పొద్దనే నియమాన్ని పాటించాలి. నీపై నమ్మకంతో కథ మొత్తం చెప్పాను. కానీ నువ్వు కథను రివీల్ చేసి నీ నిజస్వరూపం ఏమిటో బయటపెట్టుకున్నావు. ఒక సినిమా కోసం కొన్నేళ్లు కష్టపడాలి. అది నీకు తెలియదు. అర్థం కాదు కూడా. అయినా భయపడేది లేదు. నువ్వు కథ మొత్తం చెప్పినా నాకేమి ఫరక్ పడదు' అంటూ సందీప్‌రెడ్డి వంగా ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్‌గా మారింది. ఓ బాలీవుడ్ వెబ్‌సైట్‌లో 'స్పిరిట్' తాలూకు కథ బయటికొచ్చింది. ఇంటిమేట్ సీన్స్ ఎక్కువగా ఉన్నాయని, అదొక 'ఏ' రేటెడ్ మూవీ అంటూ ఆ సైట్‌లో పేర్కొన్నారు. దీపికా వల్లే స్టోరీ రివీల్ అయిందని సందీప్ రెడ్డి భావించారని, అందుకే ఆగ్రహంగా ట్వీట్ చేశారని అంటున్నారు.

# నాకే ఎందుకు ఈ పరీక్ష స్వామీ?

## హార్డ్‌డిస్క్ మాయంపై మంచు విష్ణు ఆవేదన



'కన్నప్ప' సినిమాకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌లు మాయం కావడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఘటనపై చిత్ర ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన సన్నివేశాలను ముంబయిలోని ఓ స్టూడియోలో విజువల్ ఎఫెక్ట్స్ చేయించారు. ఈ కంటెంట్ ఉన్న హార్డ్‌డిస్క్ సదరు స్టూడియో వారు కొరియర్ ద్వారా ఫిల్మ్‌నగర్‌లోని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆఫీసుకు పంపించారు. ఇక్కడ పార్శిల్‌ను ఆఫీస్‌బాయ్, ఓ మహిళ తీసుకున్నారు. ఆ తర్వాత వారు తప్పించుకు తిరుగుతున్నారు. ఇదే విషయమై చిత్ర బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'కన్నప్ప' చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. ఈలోగా హార్డ్‌డిస్క్‌లు మాయం కావడం పలు అనుమానాలకు తావిస్తున్నది. 'కన్నప్ప' చిత్రాన్ని దాదాపు రెండొందల కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు ఇందులో భాగమయ్యారు. ఇంతటి ఖరీదైన సినిమాకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను కొరియర్‌లో పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే ఆ హార్డ్‌డిస్క్‌లో ప్రభాస్‌పై చిత్రీకరించిన కీలక యాక్షన్ ఘట్టాలున్నాయని సమాచారం. వాటిని లీక్ చేస్తారేమోనని చిత్రబృందం భయపడుతున్నది. ఇదంతా తమపై కుట్రతో చేయించారని, ఓ అజ్ఞాత వ్యక్తి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని మంచు విష్ణు టీం అనుమానాల్ని వ్యక్తం చేస్తున్నది. మంచు బ్రదర్స్ మధ్య విభేదాలు భగ్గుమంటున్న తరుణంలో ఈ తాజా ఘటన ఆసక్తికరంగా మారింది. ఇక సోషల్‌మీడియాలో మాత్రం ఇదంతా పబ్లిసిటీ స్టంట్ అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. తాజాగా ఈ వివాదంపై శివుడిని ప్రశ్నిస్తూ 'నీకోసం తపస్సు చేసే నాకెందుకు ఈ పరీక్ష స్వామీ' అంటూ మంచు విష్ణు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు.

# నా దస్తూరిని ఎన్టీఆర్ ఇష్టపడేవారు!



'ఎన్టీఆర్ ఓ శక్తిస్వరూపం. ఆయన స్మారక చిహ్నం (ఎన్టీఆర్ ఘాట్) వద్ద ఇటీవల నా సినిమా ప్రారంభోత్సవాన్ని జరుపుకోవడం అనిర్వచనీయమైన అనుభూతినిచ్చింది. ఆ ప్రదేశాన్ని నేను ఓ పుణ్యక్షేత్రంగా భావిస్తా. అక్కడకు వెళితే ఏదో తెలియని శక్తిని పొందుతాం' అన్నారు ప్రముఖ దర్శకుడు వై.వి.యస్.చౌదరి. నేడు విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి. ఈ సందర్భంగా వై.వి.యస్.చౌదరి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ తాలూకు స్మృతుల్ని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ తెలుగు జాతికి స్ఫూర్తినిచ్చారని, కోట్ల మంది జీవితాల్ని ప్రభావితం చేశారని, మన జీవన ప్రయాణంలో చూసిన మహామనిషి ఎన్టీఆర్ అని కొనియాడారు. తాను ఎన్టీఆర్ అభిమానిగా మారిన వైనం గురించి చెబుతూ 'మా అమ్మనాన్న యలమంచిలి రత్నకుమారి, యలమంచిలి నారాయణరావు ఇద్దరూ నాగేశ్వరరావు అభిమానులు. అయితే మా అన్నయ్య సాంబశివరావు మాత్రం ఎన్టీఆర్ వీరాభిమాని. ఆయన నన్ను ఎన్టీఆర్ సినిమాలకు తీసుకెళ్లేవారు. అలా నేను ఎన్టీఆర్ అభిమానినయ్యాను. ఆయన జీవన విధానం, సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడనయ్యాను. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడవటం వల్లే దర్శకుడిగా ఈ స్థాయికి చేరుకున్నా. ఎన్టీఆర్ అభిమాని కావడం ఓ వరం, అదృష్టం' అన్నారు. సినీరంగంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్‌తో ఉన్న అనుబంధం గురించి మాట్లాడుతూ 'నేను ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో ఎన్టీఆర్ రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. నేను అప్పుడు అసిస్టెంట్ డైరెక్టర్‌ని. ప్రచారానికి సంబంధించిన యాడ్స్ షూట్‌లో ఎన్టీఆర్‌పై క్లాప్‌కొట్టిన సందర్భాలున్నాయి. నా దస్తూరి అంటే ఎన్టీఆర్‌కు చాలా ఇష్టం. నా చేతిరాతను ఆయన మెచ్చుకున్నారు కూడా' అని వై.వి.యస్.చౌదరి తెలిపారు.

# ఇకపై రెగ్యులర్‌గా సినిమాలు చేస్తా!

'నేను యాక్షన్ సినిమాలు చేశాను కానీ పక్కా మాస్ సినిమా ఎప్పుడూ చేయలేదు. నటుడిగా కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో రస్టిక్ విలేజ్ డ్రామాగా మెప్పిస్తుంది' అన్నారు నారా రోహిత్. ఆయన ఓ ప్రధాన పాత్రలో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్‌లతో కలిసి నటించిన 'భైరవం' చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. విజయ్ కనకమేడల దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం నారా రోహిత్ విలేకరులతో పంచుకున్న విశేషాలు..



- బెల్లంకొండ సురేష్‌గారు ఈ కథ గురించి చెప్పారు. తమిళ మాతృక 'గరుడన్'లో శశికుమార్ చేసిన పాత్ర నాకు బాగా సరిపోతుందన్నారు. ఆయన జడ్జిమెంట్‌పై నాకు గొప్ప నమ్మకం. దాంతో సినిమాకు ఓకే చెప్పాను. సార్వజనీన అంశాలున్న కథాంశమిది. తెలుగు నేటివిటీకి తగినట్లుగా దర్శకుడు మార్పులు చేశారు. ప్రతి సన్నివేశాన్ని కొత్తగా రాశారు.
- సాయిశ్రీనివాస్, మనోజ్‌లతో ఎప్పటి నుంచో పరిచయం ఉంది. మనోజ్ మా ఫ్యామిలీ ఫ్రెండ్. దాంతో షూటింగ్ కంఫర్టబుల్‌గా చేశాం. దర్శకుడు విజయ్‌కి ఈ సబ్జెక్ట్‌పై పూర్తి క్లారిటీ ఉంది. మా ముగ్గురి నుంచి తనకు కావాల్సిన పర్ఫార్మెన్స్‌ను రాబట్టుకున్నారు. 'గరుడన్' చూసిన వాళ్లకు కూడా ఒరిజినల్ సినిమా చూసిన అనుభూతినిస్తుంది.
- కెరీర్‌లో చిన్న బ్రేక్ తీసుకోవాలనుకున్నా. అనుకోకుండా అది కాస్త పెద్ద బ్రేక్ అయింది. (నవ్వుతూ). ఇకపై రెగ్యులర్‌గా సినిమాలు చేస్తా. నా తాజా చిత్రం 'సుందరకాండ' దాదాపు పూర్తికావొచ్చింది. జూలైలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం. తదుపరి చిత్రాన్ని ఆగస్టులో మొదలుపెట్టబోతున్నాం.
- ఈ సినిమాలో యాక్షన్ హైలైట్‌గా ఉంటుంది. చాలా రోజుల తర్వాత హై ఇంటెన్సిటీ యాక్షన్ ఎపిసోడ్స్ చేశాను. ముఖ్యంగా ఇంటర్వెల్ సీక్వెన్స్ గూజ్‌బంప్స్ తెప్పిస్తుంది. ఒరిజినల్‌గా ఇది వెట్రిమారన్ కథ. సినిమాలో ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుంది.
- ఇటీవలే ఫిల్మ్ ప్రొడక్షన్స్‌లో కూడా ఎంటరయ్యా. మా కజిన్స్‌తో కలిసి 'సుందరకాండ' చేస్తున్నా. మంచి కథలు వస్తే సినిమాలు నిర్మిస్తాను. నాకు హారర్ తప్ప అన్ని జోనర్ సినిమాలు ఇష్టం. డబ్బులు ఇచ్చి భయపడటం ఎందుకు (నవ్వుతూ). 'అప్పట్లో ఒకడుండేవాడు' చిత్రానికి సీక్వెల్ చేయాలనుకున్నాం. కానీ కార్యరూపం దాల్చలేదు. భవిష్యత్తులో అవుతుందోమో చూడాలి.

# స్వచ్ఛమైన అనుబంధాల్ని చూపించాం



'ప్రస్తుతం విలువలతో కూడిన సినిమాలు రావడం తగ్గిపోయింది. ఈ కథలోని కుటుంబ భావోద్వేగాలు కట్టిపడేశాయి. ఇందులోని ప్రతీ పాత్రకు ప్రేక్షకులు వ్యక్తిగతంగా కనెక్ట్ అవుతారు' అన్నారు రూపేశ్. స్వీయ నిర్మాణంలో ఆయన హీరోగా నటించిన 'షష్టి పూర్తి' చిత్రం ఈ నెల 30న విడుదలకానుంది. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం హీరో, నిర్మాత రూపేశ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. సినిమాలో స్వచ్ఛమైన ప్రేమను, కుటుంబ అనుబంధాల ఔన్నత్యాన్ని చూపిస్తున్నామన్నారు. 'ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్ కొడుకుగా కొత్త నటుడైతే బాగుంటుంది..ఎలాంటి అంచనాలు లేకుండా సినిమా చూస్తారని దర్శకుడు భావించారు. దాంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరయ్యాను' అన్నారు. ఇళయరాజా, తోట తరణి వంటి లెజెండ్స్ ఈ సినిమా కోసం పనిచేశారని, ఇళయరాజా మ్యూజిక్ సినిమా స్థాయిని పెంచిందని తెలిపారు. 'కథాబలం ఉంది కాబట్టే పెద్ద టెక్నీషియన్స్ ఈ సినిమాలో భాగమయ్యారు. కీరవాణిగారు అడిగిన వెంటనే పాట రాసిచ్చారు. ఈ సినిమాలో అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. ఇలాంటి సెన్సిబుల్ స్టోరీ ఇటీవలకాలంలో రాలేదు. రెండు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం' అన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.